

# మ్యూజికల్ మ్యూజింగ్స్

## - కస్తూరి మురళీకృష్ణ

**సుహానీ రాత్ ఢల్ చుకీ, నజానే తుం కబ్ ఆవోగీ**

**జహాఁన్ కీ ఋత్ బదల్ చుకీ,నజానే తుం కబ్ ఆవోగీ**

దులారీ సినిమాలో నౌషాద్ సంగీత దర్శకత్వంలో షకీల్ బదాయుని రాసిన ఈ ఎదురుచూపుల గీతం కాలాన్ని జయించి తరాలను ప్రభావితం చేస్తూ వస్తోంది. ప్రేయసి కోసం ఎదురు చూస్తున్న వారి బాధాతప్త హృదయాలలో చిరుజల్లు కురిపిస్తూసాంత్వననిస్తూనేవుంది . మన సినిమాలలో ఒకప్పుడు ప్రేయసి కోసం ఎదురు చూస్తూ ప్రియుడు, ప్రియుడి కోసం ఎదురు చూస్తూ ప్రేయసి బాధాతప్త హృదయాలతో, ఆశలు నిండిన మనస్సుతో అత్యంత మధురమైన విషాదగీతాలు పాడేవారు. ఇవి శ్రోతల హృదయాలలో నిద్రాణ స్థితిలో ఉన్న సున్నితమైన భావనలను జాగృతం చేసేవి.

**'విరము కూడా సుఖమే కాదా!**

**విరహము చింతన మధురము కాదా!'**

అన్న భావనను నిజం చేస్తూ అత్యంత మృదుమధురమైన ఆనందాన్ని అనంతమైన విషాదంలోనూ కలిగించేవి. ఒక తీయని బాధను కలిగించేవీ పాటలు. నిజానికి 'సుహానీ రాత్ ఢల్ చుకీ' పాటలో పదాలు ఎంతో లోతు భావనను ప్రదర్శించేవి కావు. సరళమైన పదాలు, సులభతరమైన భావం. పాట బాణీ భావానికి సందర్భానికి తగినది. పాటలో వాయిద్యాల వాడకం కూడా పరిమితం. పాట బాణీని పహాడీ రాగంలో రూపొందించాడు నౌషాద్. పహాడీ రాగం తీవ్రమైన విషాద భావనను ప్రదర్శించే రాగం. దాంతో పాటలోని పదాలకు తగ్గ రాగం తోడయి 'Constructiv interference' సాధ్యమయింది. అంటే రెండు అలలు నిర్మాణాత్మకంగా కలవటం వల్ల ఒకదానికి మరొకటి ఊపునివ్వటంతో అల మరింత పైకి ఎగసిందన్నమాట.

మహమ్మద్ రఫీ పాటను పాడిన విధానం పాట ప్రభావాన్ని త్రిగుణీకృతం చేస్తుంది. ముఖ్యంగా పాటలో ఉచ్ఛస్థాయిలో రఫీ దీర్ఘాలు తీసి పాడటం పాట స్థాయిని మరింతగా పెంచిన అంశం.

దులారీ సినిమా 1949లో విడుదలయింది. అప్పటికి హిందీ సినిమా పాటల తీరు వేరుగా ఉండేది. గాయనీగాయకులు ఉచ్ఛస్థాయిలో పాటలు పాడేవారు కారు. 'సైగల్ ' స్థిరపరచిన గాన సంవిధానం అత్యంత జనరంజకంగా ఉండేది. గాయనిలలో నూర్జహాన్ తన శక్తివంతమైన స్వరంతో ప్రజలను ఉర్రూతలూగిస్తూండేది. 1949వ సంవత్సరం హిందీ పాటల స్వరూపాన్ని సంపూర్ణంగా రూపాంతరం చెందించిన సంవత్సరం.

'దులారీ'లో మహమ్మద్ రఫీ పాడిన 'సుహానీ రాత్ ఢల్ చుకీ' ఆ కాలంలోని ఇతర పాటలతో పోలిస్తే ఒక విప్లవాత్మకమైన మార్పు. విషాద గీతమంటే ముక్కుతో పాడుతూ, ఓ మూల కూర్చుని దుఃఖించే పాట. కానీ ఈ పాట ఆ తీరును మార్చింది. నాయకుడు నాయిక కోసం ఎదురు చూస్తూంటాడు. అంతవరకూ పాటల్లో భావం 'నువ్వు రాకపోతే ఛస్తాను' 'ఎదురుచూపులతో జీవితం గడచిపోతుంది' అంటూ ఉండేది.

'కళ్ల కాయలు కాచాయనో ' 'ప్రాణం అలసిపోయిందనో ' పాడేవారు. అందుకు భిన్నంగా ఈ పాట ఆరంభంలోనే 'రాత్రి అయిపోతోంది. నువ్వింకా రాలేదు. ఎప్పుడొస్తావో ' అంటాడు నాయకుడు. అంతేకాదు ఇక్కడి 'వాతావరణం' మారిపోతోంది. ఎప్పుడొస్తావో ' అంటాడు.

పాట రచన అత్యంత చమత్కార భరితంగా సాగుతుంది. నాయకుడు ఎక్కడా తన బాధను స్పష్టంగా చెప్పడు. అంతా ప్రకృతిపై ఆరోపించి చెప్తాడు. ఆ కాలంలో ఇదొక నూతన గేయ రచనా సంవిధానం. తెల్లవారే మేల్కొనే వారికి రాత్రి పగలుగా మారే సమయంలో అతి సున్నితంగా మార్పులు సంభవించటం అనుభవమే. నిశ్చలంగా ఉన్న జగతిలో సన్నటి కదలికలు సాగుతాయి. గాలి దిశమారుస్తుంది.తారలు వెలతెలబోతాయి. రాత్రిలోని ఉత్సాహం తగ్గి పగలు ఆరంభోత్సాహాన్ని ప్రదర్శిస్తూంటూంది. అయితే తన ప్రేయసి వస్తుందని రాత్రంతా ఎదురు చూస్తున్న ప్రియుడికి మాత్రం వెలుతురు తెచ్చే పగలు దుర్భరమైన నిరాశను కలిగిస్తుంది. అలవికాని విషాదాన్ని రగిలిస్తుంది. సాధారణంగా ఉదయం ఆనందదాయకం. చీకటిని పారద్రోలుతుంది. కానీ ఇక్కడ చీకటి వెళ్లి పగలు రావటం అంటే నాయకుడి ఆశల అగ్నిపై నీరు చల్లటమే. ఉదయం ఈ సందర్భంలో ఆనందదాయకం కాదు. అందుకే రాత్రి అయిపోతోందని బాధపడుతున్నాడు నాయకుడు. ఈ బాధ మనకు పాటలోని పదాలలో కనబడదు. గాయకుడి స్వరంలో ధ్వనిస్తుంది. అది ఈ పాట గొప్పతనం. ఆ కాలానికి కొత్తదనం. సైగల్ మంద్ర స్వరానికి అలవాటు పడ్డవారు రఫి ఉచ్చ స్వరగానానికి ఉలిక్కిపడ్డారు. కొత్తగాన సంవిధానానికి ఆనందపరవశులయ్యారు. అలా 1949లో రఫీ తెరపైకి తన స్వరశక్తితో వచ్చాడు.

అదే 1949లో 'బర్సాత్' సినిమా పాటలు విడుదలయ్యాయి. సినిమాలోని ఒక్క పాట తప్ప మిగతా పాటలన్నీ పాడి 'లత' ఆ కాలంలో ఏ గాయనికి లేని వైవిధ్యం తన స్వరానికి ఉందని నిరూపించింది. 'బర్సాత్'తో సంగీత దర్శకులు శంకర్ జైకిషన్ తెరపైకి వచ్చారు. హిందీ సినీగేయ బాణీ రచనా సంవిధానం సంపూర్ణంగా రూపాంతరం చెందింది. కొత్త తరం వర్షపు తుఫానులో పాత తరం కొట్టుకుపోయింది.

**నజారే అప్నీ మస్తియా దిఖాదిఖా కె సోగీ**

**సితారే అప్నీ రోషనీ లుటాలటూ కె సోగయీ**

**హర్ ఏక్ షమ్మ జల్ చుకీ నజానే తుం కబ్ ఆవోగీ**

చాలా సులభంగా బోధపడే పదాలివి. దృశ్యాలు చురుకుదనం మత్తు ప్రదర్శించి ప్రదర్శించి అలసి అలసి నిద్రపోతున్నాయి. నక్షత్రాలు వెలుగులు విరజిమ్మి విరజిమ్మి అలసి నిద్రపోతున్నాయి. ఎటు చూసినా వెలుతురు పంచుకుంటుంది. ఇంకెప్పుడు వస్తావు? అంటున్నాడు నాయకుడు. అంటే ఆమెకోసం ఎదురు చూసి చూసి తానూ అలసిపోయాడు. అవి నిద్రిస్తున్నాయి అలసి. తాను మాత్రం ఆమె వస్తుందన్న ఆశతో ఎదురుచూస్తూనే ఉన్నాడు అని నాయకుడు అత్యంత నర్మగర్భంగా చెప్తున్నాడన్నమాట. ఈ పాటకు ప్రాణం రఫీ స్వరం. 'నజారే' అని ఉచ్చస్థాయికి వెళ్లి వెంటనే 'అప్నీ మస్తియా' అంటూ క్రిందకు దిగి, దిఖాదిఖానేలోని అలసట, నిరాశలు ప్రదర్శిస్తూ 'సోగయీ' అని బాధాతప్త హృదయాన్ని ప్రదర్శించటం ఒక అద్భుతం. స్వరం ద్వారా భావాన్ని దృశ్యరూపంలో మనస్సు తెరపై ప్రదర్శించటమనే అత్యద్భుతమైన గాన సంవిధానంపై తెరతీశాడు రఫీ ఈ పాటతో. పాట వింటూంటే బాధ మనస్సుకు తెలుస్తుంది. పదాలు ప్రదర్శించని బాధ. బాణీలో లేని బాధ. దృశ్యంలో నాయకుడి హృదయంలో ఉన్న బాధ తిన్నగా ప్రేక్షకుడి హృదయానికి తెలియజేస్తుంది, అనుభవింపచేస్తుంది రఫీ స్వరం. ఇది 'నజానే తుం కబ్ ఆవోగీ' అని పలకటంలో నిరాశను నిస్పృహను పాతాళానికి తాకిస్తుంది.

**తడప్ రహేహై హం యహా, తుమ్హారే ఇంత్‌జార్‌మే**

**ఖిజాక రంగ్ ఆచలాహై మౌసం – ఏ – బహార్‌మే**

**హవాభీ రుఖ్ బదల్ చుకే హై, నజానే తుం కౌన్ ఆవోగీ**

నీ రాకకోసం ఎదురుచూస్తూ తపిస్తున్నాను. వసంతంలో ఆకులు రాలేకాలం వచ్చేసింది. వీచేగాలి దిశకూడా మారిపోయింది. ఇంకా ఎప్పుడు వస్తావు? అంటున్నాడు నాయకుడు. వసంతంలో ఆకులు రాలే కాలం ఛాయలు రావటం పూర్తిగా ప్రతీకాత్మకం. అతడి నిస్పృహను చూపిస్తుంది.గాలి దిశను మార్చటం ప్రతి ఉదయం సంధ్య సమయంలో జరుగుతుంది.

'దులారి' సినిమా ఈనాటికీ గుర్తుండటానికి ప్రధాన కారణం ఈ పాటనే. ఈ పాటకు నటించిన 'సురేశ్'ను మరచిపోయారు. సినిమా కూడా మామూలు సినిమా. సినిమాలోని ఇతర పాటలు అంత పెద్దగా 'హిట్ ' కావు. కానీ ఈ ఒక్కపాట ఈనాటికీ సజీవంగా ఉంది. కారణం పాటలోని సున్నితమైన భావాల్ని అతి గొప్పగా రఫీ తన స్వరంలో 'అమరం' చేసిన విధానం.

ఇలాంటిఆర్ద్రతనే, ఇలాంటి సున్నితమైన భావాలనే, ఇలాంటి ఎదురుచూపుల వేదనలోని ఆనందాన్ని ఇనుమడింపచేసే పాట 'మధుమతి' సినిమాలో 'ఆజారే మై తొ కబ్ సే ఖడీ ఇస్ పార్' పాట.

**మైతో కబ్ సే ఖడీ ఇస్ పార్**

**యె అఖియా థక్ గయి పంథ్ నిహార్**

**ఆజారే పర్‌దేశీ...**

'మధుమతి'లోని ఈ పాటకు సంగీత దర్శకుడు 'సలిల్ చౌధరి'. పాట రాసింది శైలేంద్ర. పాటలోని పదాలతో దృశ్యాలను సృజించే అద్భుతం శైలేంద్ర రచనలో గమనించవచ్చు. అయితే పాట బాణీని సృజించటంలోనే పాట భావాన్ని శ్రోత అనుభవానికి తీసుకువచ్చే చమత్కారం సలిల్  చౌధరి చేయటం కూడా గమనించవచ్చు. ఇది విరహానికి, అసంతృప్తికి సంబంధించిన పాట. జన్మజన్మల ఎదురు చూపుల పాట. పలు జన్మల విఫల ప్రేమవల్ల జనించిన విరహగీతం.

**తుం సంగ్ జనం జనం కాఫేరే**

**భూల్  గయే క్యా సాజన్ మేరే**

**తడపత్ హూ మై సాంఝ్  సవేరే**

అంటుంది నాయిక. నీతో జన్మ జన్మల సంబంధం. అలాంటప్పుడు  నన్ను ఎందుకని మరచిపోయావు? నీకోసం రాత్రిబవళ్లు ఎప్పటినుంచో ఎదురుచూస్తున్నాను. నీ దారివైపే చూస్తూ కళ్లు అలసిపోయాయి. ఇకనైనా రావయ్యా అంటోంది నాయిక.

జన్మ జన్మల విరహం ఇది.  ప్రతి జన్మలో దాహం తీరక అర్ధాంతరంగా ముగుస్తోంది వారి బంధం. భారతీయ సిద్ధాంతం ప్రకారం గత జన్మలో ఎంత నేర్చుకుంటారో, ఈ జన్మలో పుట్టుకతో ఆజ్ఞానం ఉంటుంది. అక్కడినుంచి నేర్వటం ఆరంభిస్తాం. అంటే ఈ జన్మ గత జన్మ కొనసాగింపన్నమాట. దీన్ని సూచిస్తూ, ఈ ఎదురుచూపులు ఈనాటివి కావు ఎప్పటివో అన్నదానికి ప్రతీకగా పాట 'మైతో' అంటూ సగం నుంచి ఆరంభమవుతుంది. సాధారణంగా 'ఆజారే పరదేశీ, మైతో కబ్‌సే ఖడి ఇస్ పార్' అంటూ ఆరంభమవ్వాలి. కానీ 'మైతో' అంటూ మధ్యలోంచి ఆరంభమవటం గత జన్మలో ఆగిన ఎదురుచూపులు ఈ జన్మలో ఆరంభమయ్యాయనడానికి సూచిస్తుంది. అదీ కళాకారుల చమత్కారం. ఇలా మధ్యలో ఆరంభమవటం తెలియకుండానే ప్రేక్షకుడిలో ఒక అసంతృప్తిని కలగజేస్తుంది. అది పాట ప్రభావాన్ని ఇనుమడింపచేస్తుంది. ఇక పాడేది లతా మంగేష్కర్ అంటే సరస్వతీదేవి స్వరం అయితే ఇక చెప్పేదేముంది? ఈ పాటలో సలిల్ చౌధరి పాశ్చాత్య సంగీత ప్రావీణ్యాన్ని అత్యద్భుతమైన రీతిలో ప్రదర్శించాడు. వయొలిన్ల వాడకం అద్భుతం. పాట చిత్రీకరణ కూడా అద్భుతం. ఆరంభంలో అస్పష్టంగా ఉన్న దృశ్యం రాను రాను స్పష్టం అవుతుంది.

**మై న దియా ఫిర్ భీ మై ప్యాసీ**

**భేద్ యె గహరా బాత్ జరాసి**

**బిన్ తేరే హర్ రాత్ ఉదాసీ**

తాను నది అయినా దాహం తీరటంలేదు. లోతైన రహస్యం కానీ అతి చిన్న విషయం. అతడులేకుండా ప్రతి రాత్రీ విషాదమే. ఇలాంటి అలతి పదాలతో సందర్భాన్ని అనుసరిస్తూ, సందర్భ పరిధిని దాటిన భావాలు కలిగేట్టు రాయటం శైలేంద్ర ప్రత్యేకత.

**మై దియ్ కే ఐసీ బాతీ**

**జల్ న సకీ జో ఝ్ భిన పాతీ**

**అమిల్ మేరే జీవన్ సాథీ**

ఆమె ఎలాంటి కొవ్వొత్తి అంటే వెలగలేదు ఆరిపోలేదు. కాబట్టి తన ప్రియుడిని వచ్చి కలవమంటోంది. అప్పుడే ఆమె జీవితానికి సార్థకత లభిస్తుంది. వెలగకపోవటం, ఆరలేకపోవటం అనంతమైన జన్మలను సూచిస్తుంది. అతడు కలిస్తే కానీ ఈ జన్మ పరంపర పూర్తికాదు. మరోవైపు తరచి చూస్తే ఆధ్యాత్మిక భావం గోచరిస్తుంది. 'జీవన్ సాథ్'ని 'పర్‌దేశీ'ని భగవంతుడిగా భావిస్తే పాట స్వరూపమే మారిపోతుంది. అందుకే శైలేంద్రను 'హిందీ సినీ పాటల కబీర్' అంటారు.

ఇలాంటి సందర్భంలోనే ప్రియుడి కోసం ప్రేయసి ఎదురుచూసే పాట 'జరాసీ ఆహట్ హోతీహై' 'హకీకత్' సినిమా కోసం మదన్ మోహన్ సంగీత దర్శకత్వంలో కైఫీ ఆజ్మీ కవితకు ప్రాణం పోసిన లత స్వరంలోనూ ఉంటుంది.

**జరాసీ అహట్ హోతీ హై దిల్ సోచతాహై**

**కహీయే వో తో నహీ**

చిన్న సవ్వడి అయినా అతనేమో అనుకుంటుందట ఆమె హృదయం

**ఛుప్‌కె సీనేమే కోయీ జైసే సదా దేతే హై**

**శ్యాం సె పహలే దియా దిల్ క జలా దేతా హై**

**హై ఉసీకీ యే సదా, హై ఉసీకీ యే అదా...**

నిశ్శబ్దంగా హృదయాన్ని ఎవరో పిలిచినట్టు, సాయంత్రం కాగానే ఆమె హృదయం దీపాన్ని వెలిగిస్తుందట. ప్రతి సవ్వడినీ అతడి పదధ్వనిగా పొరపడుతుందట. దీన్ని కృష్ణశాస్త్రి 'ప్రతిగాలి సడికి తడబడకు, పదధ్వనులనీ పొరబడకు' అన్నాడు.

**శక్ల ఫిర్ తీ హై నిగాహోమే వహీ ప్యారీసే**

**మేరి నస్ నస్ మె మచల్‌నే లగిచింగారీసీ**

**ఛూగయా జిస్మ్ మెరా కిస్ కె దామన్ కీ హవా**

ఆమె కళ్లముందు అతని ప్రియవదనమే ఉందట. దాంతో ఆమె నరనరాన అగ్నిరాజుకుంటోందట. అతని శరీరం నుంచి వీచిన గాలి ఆమెని తాకుతోందట. అది అగ్నిని ప్రజ్వలింపచేస్తోంది. ఇదీ పాట. ఈ పాటను వింటుంటే మైమరచిపోతాం. పదాలలోని విరహవేదన తీవ్రతను లత స్వరం ధ్వనిస్తుంది. దాంతో పాట చిత్రీకరణ గొప్పగా లేకున్నా, నాయక వదనం భావాలను ప్రదర్శించకున్నా పాట అద్భుతంగా అనిపిస్తుంది.

అయితే 'విరహగీతం' అనగానే గుర్తుకు వచ్చేపాట 'నీవులేక వీణ పలుకనన్నది. నీవు రాక రాధ నిలువలేనన్నది' సుశీల స్వరం ఎంత అద్భుతమైన రీతిలో భావాలను పలుకుతుందంటే, విరహవేదన తీవ్రతరమై ఒక స్థాయిలో అత్యంత ఆనందం కలిగిస్తుంది. ఈ ఎదురు చూపులు అంతం కాకూడదని, ఈ పాట ఇలాగే కొనసాగాలని అనిపిస్తుంది.

నీవులేక వీణ పలుకలేనన్నది
నీవు రాక రాధా నిలువలేనన్నది.

డా.చక్రవర్తిలో ఆత్రేయ రాసిన ఈ పాట 'సుహానీ రాత్ ఢల్ చుకీ ' పాటలాగా ఇతరులుపై తన ఎదురుచూపులకు వేదనను ఆరోపించి చెప్తోంది తప్ప విడిగా తన ఎదురు చూపులను ప్రదర్శించదు.

జాజిపూలు నీకై రోజు రోజు పూచె
చూసి చూసి పాపం సొమ్మసిల్లి పోయే
చందమామ నీకై తొంగి తొంగి చూసి
సరసను లేవని అలుకలు బోయే

కలలనైన నిన్ను కనుల చూతమన్నా
నిదురరాని నాకు కలలు కూడ రావే
కదలలేని కాలం విరహగీతి రీతి
పరువము వృధగా బరువుగ సాగే

తలుపులన్ని నీకై తెరచి వుంచి నాను
తలపులెన్నొ మదిలో దాచి వేచి నాను
తాపమింక నేను ఓపలెను స్వామి
తరుణిని కరుణను యేలగ రావా

పాట ఒక ప్రవాహంలా సాగిపోతుంది. విరహంలో ఇంత ఆనందం ఉంటుందా అని ఉక్కిరి బిక్కిరి చేస్తుంది. 'కదలలేని కాలం విరహగీతి రీతి ... బరువుగ సాగే' అంటుంది. కానీ పాట మాత్రం ఒక ఉధృతమైన రసప్రవాహంలా పరవళ్లు తొక్కుతూ సాగుతుంది. ఎన్నిమార్లు విన్నా తనివి తీరదు. తీయని విరహవేదనను ప్రేయసి పక్కనే ఉన్నా రగిలిస్తుంది. ఇది ఏ ఒక్క వ్యక్తికి సంబంధించిన వేదన కాదు. ప్రతివ్యక్తి హృదయంలో నిద్రాణంగా ఉన్న ఆధ్యాత్మక ప్రేమ భావనకు సంబంధించిన వేదన. 'నీవురాక రాధ' అనటంతోటే పాటలో లౌకిక ప్రేమ నీడలోంచి ఆధ్యాత్మక ప్రేమ భావన తొంగి చూస్తూంటుంది.

ఇలాంటి విరహగీతాలు సినీ స్థాయిని దాటి ప్రతివ్యక్తి వ్యక్తిగత విరహగీతాలుగా, భౌతిక ప్రేమను దాటి ఆధ్యాత్మక ప్రేమ గీతాలుగా ఎదిగాయి. శ్రోతలలో ప్రేమ భావనలోని సున్నితత్వాన్ని జాగృతం చేస్తాయి. ముఖ్యంగా ఈ విరహగీతాలను అర్ధం చేసుకుని అనుభవించిన వ్యక్తిలో ప్రేయసి పట్ల గౌరవం, అభిమానం పెరుగుతాయి తప్ప కసి, ద్వేషం వంటి భావనలు కలగవు. 'హింసాత్మక ప్రేమ' అన్న భావన దరిదాపులకు కూడా రాదు. అందుకే ఇలాంటి సున్నితమైన భావాలను ప్రదర్శించే పాటలను నవతరానికి ఒక పద్ధతి ప్రకారం తెలియచెప్పాల్సిన అవసరం ఉంది. రాక్షస ప్రేమలు, రతిక్రీడలే ప్రేమగా అర్ధం చేసుకుంటున్న తరానికి ప్రేమ భావనలో అంతర్లీనంగా ఉన్న 'ఆత్మ అన్వేషణ'ను తెలియచెప్పాల్సి ఉంది. ఒకరకంగా చూస్తే, వ్యక్తిలోని ప్రేమ భావన, ఒక ఆత్మ మరొక ఆత్మను అన్వేషించటం తప్ప మరొకటి కాదు. అందుకే ఓ పాటలో

**మన్‌కె అందర్ ఛుపాయే హువే మిలన్ కీ లగన్**

**అప్‌ని సూరజ్ సే ఏక్ బిఛ్‌డీ హువీ కిరణ్**

**అంటాడు గేయ రచయిత**

మనసులో కలవాలన్న తీవ్రమైన కోరిక దాగి ఉంది. ఎవరితో కలవటం అంటే సూర్యుడి నుంచి వేరు అయిన కిరణం తాను కాబట్టి మళ్లీ సూర్యుడితో కలవాలనే తపన అన్నమాట. ఇది ప్రేమ స్వరూపం. పరమాత్మనుండి వేరయిన ఆత్మలు మరో ఆత్మతో జతకలవటం వల్ల పరమాత్మలో భాగమైపోవాలన్న తపన అన్నమాట ప్రేమ.

*(వచ్చే నెల మరికొన్ని పాటలు)*

Post your comments